
JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి I శనివారం 31-01-2026
Medchal - Malkajgiri I Saturday 31-01-2026
Follow: jayabherinews
సంపుటి : 02 I సంచిక : 245
పేజీలు : 8 I వెల : 5
Vol. 02 I Issue 245 I Pages : 8 I ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


# మేడారం జనసంద్రం
# పోటెత్తిన భక్తజనం



జయభేరి, వరంగల్, జనవరి 30 :

మేడారం మహా జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. వన దేవతలు సమ్మక్క, సారలమ్మ గద్దెలపై కొలువుదీరడంతో శుక్రవారం భక్తులు పోటెత్తారు. దీంతో మేడారం పరిసరాలు జనసంద్రంగా మారాయి. భారీగా తరలివచ్చిన భక్తులను నియంత్రించడం అధికారులకు సవాలుగా మారింది. మరోవైపు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నేడు మేడారం సందర్శించి, వన దేవతలకు మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆయన పర్యటనకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.బుధవారం సారలమ్మ, గురువారం సమ్మక్క గద్దెలపైకి చేరడంతో గురువారం అర్ధరాత్రి నుంచే భక్తులు తమ మొక్కులు చెల్లించుకోవడం ప్రారంభించారు. అయితే, గురువారం రాత్రి జాతర ప్రాంగణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన కొందరు భక్తులు, అక్కడే ఉన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కారు అద్దాలను, సమీపంలోని దుకాణాలను ధ్వంసం చేశారు.ఈ నెల 28న ప్రారంభమైన ఈ జాతర 31న ముగియనుంది. జాతరకు వీఐపీలు, వీవీఐపీలు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఐజీ చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలో 25 మంది ఐపీఎస్ అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అయితే, పోలీసులు వీవీఐపీలు, వారి కుటుంబాల సేవకే పరిమితమై సామాన్య భక్తుల రద్దీని నియంత్రించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువెల్ ఓరమ్ వన దేవతలను దర్శించుకున్నారు.

" తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో తన కోర్సు విజయవంతంగా పూర్తి చేశారు. హార్వర్డ్ లోని 'కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్'లో నిర్వహించిన వారం రోజుల ప్రత్యేక లీడర్‌షిప్ కోర్సులో చేరి పూర్తి చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ఆ సంస్థ నుండి అధికారికంగా లీడర్ షిప్ కోర్సు సర్టిఫికెట్‌ను అందుకున్నారు.

# రేవంత్ రెడ్డి హార్వర్డ్ కోర్సు పూర్తి



జయభేరి, హైదరాబాద్, జనవరి 30 :

ఈ నెల 25 నుంచి 30 వరకు జరిగిన 'లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ' అనే పేరుతో నిర్వహించిన తరగతులకు సీఎం రేవంత్ స్వయంగా హాజరయ్యారు.ఈ అపూర్వమైన అనుభవాన్ని సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' షేర్ చేసుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 20 దేశాల నుంచి వచ్చిన 60 మంది విద్యార్థులతో కలిసి తాను ఈ తరగతులకు హాజరైనట్లు తెలంగాణ సీఎం పేర్కొన్నారు. ఈ లీడర్‌షిప్ కోర్సులో భాగంగా అక్కడి ప్రొఫెసర్లు, టీచర్స్, తన తోటి విద్యార్థుల నుంచి పాలనాపరమైన మెళకువలు, నాయకత్వ లక్షణాల గురించి ఎంతో నేర్చుకున్నట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. రాజకీయాలు, పాలనా వ్యవహారాలతో అనునిత్యం ఎంతో బిజీగా ఉండే తెలంగాణ ముఖ్యమంత్రి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు.

అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో 'లీడర్ షిప్ ఇన్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ: కాన్ఫ్లిక్ట్ అండ్ కరేజ్' ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న రేవంత్ కు హార్వర్డ్ అధ్యాపకులు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. అధికారంలో ఉండగానే ఈ సర్టిఫికెట్ పొందిన తొలి భారతీయ ముఖ్యమంత్రిగా రేవంత్ చరిత్ర సృష్టించారు. ఈ ప్రోగ్రామ్ లో ప్రపంచ వ్యాప్తంగా 20కి పైగా దేశాల నుంచి 62 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుదీర్ఘంగా క్లాసులు జరిగాయి. ఈ శిక్షణలో రేవంత్ సాధారణ విద్యార్థిలా గడిపారు. 21వ శతాబ్దంలో ప్రపంచానికి ఎదురయ్యే సవాళ్లు, నాయకత్వ మెళకువలు, సంక్షోభ పరిస్థితులను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై కేస్ స్టడీలు, గ్రూప్ ప్రాజెక్టుల ద్వారా వీరికి శిక్షణ కొనసాగింది. మంచు తుపాను కారణంగా అక్కడి ఉష్ణోగ్రతలు 24 డిగ్రీలకు పడిపోయినప్పటికీ... విరామం తీసుకోకుండా రేవంత్ క్లాసులకు హాజరయ్యారు.



# పీటీ ఉష కుటుంబంలో తీవ్ర విషాదం..
## ఆమె భర్త అకస్మికంగా మృతి

- జయభేరి, న్యూ ఢిల్లీ, జనవరి 30 :

భారత ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉష కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె భర్త, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ మాజీ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీనివాసన్ (67) శుక్రవారం తెల్లవారుజామున అకస్మికంగా మృతి చెందారు. శ్రీనివాసన్ తన నివాసంలో అనూహ్యంగా కుప్పకూలి కింద పడ్డారు. వెంటనే ఆయనను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, వైద్యుల దర్యాప్తులో ఆయన అప్పటికే మరణించినట్లు నిర్ధారించబడింది. శ్రీనివాసన్ 1991లో పీటీ ఉషతో వివాహ బంధంతో ఒక్కటయ్యారు. వీరికి ఉజ్వల్ అనే కుమారుడు ఉన్నారు. CISFలో పదవీ విరమణ చేసుకున్నప్పటినుండి, క్రీడా రంగంలో పీటీ ఉషకు మద్దతుగా ఆయన కీలకంగా నిలిచారు. పీటీ ఉష నడిపే ఉష స్కూల్ ఆఫ్ అథ్లెటిక్స్ అభివృద్ధిలో, యువ క్రీడాకారుల శిక్షణ, వనరుల ఏర్పాట్లలో శ్రీనివాసన్ చేసిన సహకారం స్ఫూర్తిదాయకంగా నిలిచింది.పీటీ ఉష సాధించిన అంతర్జాతీయ పతకాల వెనుక ఆయన నిరంతర ప్రోత్సాహం, మద్దతు కీలకమైనది. ప్రతి విజయ సందర్భంలో ఆయన భుజంగా నిలిచి, సాయం అందించడం క్రీడా వర్గం గుర్తిస్తున్నది. క్రీడాకారులు, మాజీ క్రీడా ప్రముఖులు, రాజకీయ నాయకులు శ్రీనివాసన్ మృతిని తీవ్రంగా ఆవేదనగా తెలిపారు. శ్రీనివాసన్ ఆకస్మిక మరణం పీటీ ఉషకు, ఆమె కుటుంబానికి అతి పెద్దలోటు అని ఆయనకి సమీపంగా ఉన్న వారు చెబుతున్నారు. క్రీడా లోకంలో ఆయనను "పిల్లర్ ఆఫ్ సపోర్ట్"గా గుర్తిస్తూ, భౌతిక సానుభూతితో పాటు మానసిక ప్రోత్సాహం కూడా అందించారు. ప్రధానంగా క్రీడా, విద్య, యువత శిక్షణ రంగాల్లో చేసిన సేవలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి గా నిలుస్తాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. శ్రీనివాసన్ మృతి క్రీడా ప్రపంచానికి తీరని లోటు కాగా, పీటీ ఉష కుటుంబానికి కూడా పెద్ద షాకింగ్‌గా మారింది. శ్రీనివాసన్ మరణ వార్త తెలియగానే ప్రధాని నరేంద్ర మోదీ .. పీటీ ఉషకు ఫోన్ చేసి ఆమెను పరామర్శించారు. కష్టకాలంలో ఆమెకు, ఆమె కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతూ ప్రధాని తన సానుభూతిని వ్యక్తం చేశారు.

# అరచేతితో సూర్యకాంతిని ఆపలేరు

- అలాగే కేసీఆర్ చేసిన అభివృద్ధిని దాచలేరు
- కాంగ్రెస్ సర్కార్ డైవర్షన్ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

జయభేరి, హైదరాబాద్, జనవరి 30 :

10కాంగ్రెస్ సర్కార్ డైవర్షన్ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఒక అక్రమ కేసులో కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి డైవర్షన్ డ్రామా ఆడుదామని అనుకున్న సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టులా అదే రోజు తెలంగాణలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అద్భుత ప్రగతిని ఎకనామిక్ సర్వే 202526 కళ్లకుకట్టిందని అన్నారు.అర చేతితో సూర్యకాంతిని ఆపలేరని అంటారని.. దీనికి తగ్గట్టే కేసీఆర్ పదేండ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని దాచిపెట్టాలని రేవంత్ బృందం ఎన్ని దుష్టపన్నాగాలు పన్నినప్పటికీ కుదరట్లేదని కేటీఆర్ అన్నారు. ఆర్బీఐ, నీతిఆయోగ్ వంటి మేధో సంస్థలు, 'ది ఎకానమిస్ట్' వంటి అంతర్జాతీయ పత్రికలు, నిపుణులు కేసీఆర్ పాలనను ఇప్పటికే వేనోళ్ల పొగిడారని గుర్తుచేశారు. తాజాగా ఈ జాబితాలో కేంద్రప్రభుత్వం వెలువరించిన ఆర్థిక సర్వే 202526 కూడా చేరిందని తెలిపారు. కాళేశ్వరానికి, మిషన్ కాకతీయకు కితాబు ఇచ్చాయని అన్నారు.2014లో సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాలుగా ఉంటే అది 2023 ఆర్థిక సంవత్సరానికి 2.2 కోట్ల ఎకరాలకు పెరిగినట్టు సర్వే వెల్లడించిందని కేటీఆర్ తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీస్టేజ్, మల్టీ పర్పస్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం, చెరువుల పునరుజ్జీవనానికి ఉద్దేశించిన మిషన్ కాకతీయ పథకాలతోనే రాష్ట్రంలో సాగు విప్లవం సాధ్యమైందని ఆర్థిక సర్వే నొక్కి చెప్పిందని పేర్కొన్నారు. అలా తొమ్మిదేండ్ల వ్యవధిలోనే 89 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించడంలో కేసీఆర్ సర్కారు విజయం సాధించినట్టు ప్రశంసించిందన్నారు.





# చదువు అనేది గేమ్ ఛేంజర్

- అమెరికాలో 18 ఏళ్ల కే పిల్లలు బయటకు వెళ్లి స్వతంత్రంగా జీవిస్తారు
- నిర్మాణం కోసం మీరు రూ.100 కోట్లు ఖర్చు చేశారు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

జయభేరి, గుంటూరు :

చదువుకున్న కాలేజీని గుర్తు పెట్టుకుని 1981లోనే జింకానా ఏర్పాటు చేసుకుని ఇంత పెద్ద సాయం చేసిన వారందరికీ అభినందనలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన గుంటూరు జీజీహెచ్ లో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వంలో, పాలనలో అనేక కార్యక్రమాల్లో పాల్గొంటాను. కానీ ఈ రోజు నేను వచ్చిన ఈ కార్యక్రమం ఒక స్ఫూర్తిని ఇచ్చింది. ఇంకా సమాజంలో మంచి మిగిలి ఉంది అనడానికి మీరంతా ఉదాహరణ. 40, 50 ఏళ్ల క్రితమే మీరు విదేశాలకు వెళ్లారు. కొందరు జన్మభూమిని మర్చిపోతారు. మనమే కాదు... మన చుట్టూ ఉన్న సమాజం బాగుండాలి అనేది మన సంస్కృతి. ఎందరో ముందుకు వచ్చి పాఠశాలలకు, ఆస్పత్రులకు, దేవాలయాలకు, సత్రాలకు, ఆట స్థలాలకు పెద్ద ఎత్తున ప్రజలే విరాళాలు ఇచ్చారని అన్నారు. మనదేశంలో ఉన్న సంస్కృతీ, సంప్రదాయాలు మరే దేశంలో లేవు. ...మిగతాది 2 లో

# ప్రజా ప్రభుత్వంలో విద్యకు పెద్ద పీఠ

...మిగతాది 3 లో

# ఏపీకి సహకరిస్తున్న రేవంత్ ప్రభుత్వం

- చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లిస్తున్న శిష్యుడు
- మాజీ మంత్రి హరీశ్ రావు



జయభేరి, హైదరాబాద్ :

రాజకీయాల కంటే తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం. కాళోజీ ముందే ఊహించి చెప్పినట్లు.. ప్రాంతం వాడే తెలంగాణకు చేస్తున్న ద్రోహం ఇదని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. శనివారం అయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. హరీష్ రావు మాట్లాడుతూ దేశ రాజధాని డిల్లీ కేంద్రంగా ...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## ఏపీకి సహకరిస్తున్న రేవంత్

తెలంగాణకు జరుగుతున్న జల ద్రోహాన్ని వివరించేందుకే ఈ ప్రెస్ మీట్. ఒక వేళ ఆ తప్పు జరిగితే తెలంగాణ నీటి చరిత్రలో ఈరోజు ఒక బ్లాక్ డే గా మిగిలిపోతుంది. గోదావరి నదీ జలాల అక్రమ తరలింపు విషయంలో BRS మొదటి నుండి అప్రమత్తం చేస్తూనే వస్తుంది. గతంలో అనేక సార్లు ప్రెస్ మీట్ పెట్టినం. వాస్తవాలు బయట పెట్టినం. నామమాత్రంగా బ్యాక్ డేట్ వేసి లెటర్లు మీడియాకు విడుదల చేసి చేతులు దులుపుకున్నారు. ముల్లు కర్రతో పొడుస్తూ మొద్దు నిద్ర లేపుతున్నమని అన్నారు. అది బనకచర్ల అయినా, నల్ల మల సాగర్ అయినా మారింది పేరు మాత్రమే కానీ, ఏపీ జల దోపిడి ఆగలేదు. జల ద్రోహం విషయంలో కత్తి చంద్రబాబుది అయితే, పొడిచేది రేవంత్ రెడ్డి. సమైక్య పాలనలో మనకు నీటి వాటాల్లో తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్.. నేడు మరో చారిత్రక ద్రోహం చేస్తున్నదని అన్నారు. డిల్లీలో జరుగుతున్న ఇరిగేషన్ మీటింగ్ సాక్షిగా రేవంత్ ప్రభుత్వం మరణ శాసనం రాయబోతున్నది. పోలవరం నల్లమల సాగర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఏపీకి సహకరిస్తున్నది. ఆ కుట్రల తీరు గమనిస్తే... పోను పోను అనుకుంటూనే రేవంత్ రెడ్డి ఆనాడు డిల్లీ మీటింగ్ కు వెళ్ళాడు. పెట్టబోను అంటూనే సంతకం పెట్టి తెలంగాణ నదీ జలాల హక్కులను కాలరాసాడు. వేయను అంటూనే కమిటి వేసి ఏపీ జల దోపిడీకి రెడ్ కార్పెట్ వేశాడు. టెండర్ చివరి తేదీ అయిపోయాక సుప్రీం కోర్టు కు వెళ్ళి నల్లమల సాగర్ ప్రాజెక్టుకు పరోక్షంగా అంగీకారం తెలిపాడు. పస లేని రిట్ వేసి పరిపూర్ణంగా నల్లమల సాగర్ కు మద్దతు ప్రకటించాడు. దానికి వాపస్ తెచ్చుకున్నడు ఉత్తం. ప్లాన్డ్ గా సహకరిస్తూ చంద్రబాబుకు రేవంత్ గురు దక్షిణ చెల్లిస్తున్నడు. ఏపీ ఒత్తిడితో జరుగుతున్న మీటింగ్ లో నేడు ఇంజినీర్లు పాల్గొంటున్నారు. పేరుకు జలవివాదాల మీటింగ్ కానీ, మన 200 టీఎంసీలను గంపగుత్తగా తరలించుకుపోయే నల్లమలసాగర్ అనే ప్రాజెక్టు సంబంధించిన కుట్ర ఇది. ఇప్పుడు కూడా ఏపీ నల్లమలసాగర్ లింకు ప్రాజెక్టునే తెరమీదకు తెచ్చి చర్చ చేస్తున్నరు. బిఆర్ఎస్ నిలదీస్తే..డిసెంబర్ 30వ తేదీన నేను ఉత్తరం రాస్తే.. తెల్లారి ఒక మీటింగ్ రాసింది కాంగ్రెస్ ప్రభుత్వం. అందులో ఏముంది.. ఏపీ నల్లమల సాగర్ విషయంలో ముందుకు పోతుంది, డిపిఆర్ ప్రక్రియ ముందుకు పోతుంది అని స్పష్టంగా రాసిందని అన్నారు. దీంతో పాటు ఇంకేం రాసారు.. రెండు కండీషన్లకు ఒప్పుకుంటేనే ఢిల్లీ మీటింగ్ కు వస్తం అన్నరు. మొదటి కండీషన్ ఏమిటంటే నల్లమల సాగర్ కు డిపిఆర్ వెంటనే ఆపాలి, కేంద్రం అనుమతుల ప్రక్రియను తక్షణం ఆపాలి అని.. రెండోది.. ప్రీ ఫీజబులిటి రిపోర్టు ఆపినట్లు ఏపీ హామి ఇవ్వాలని రాసారు? నా ప్రశ్న ఏమిటంటే.. ఈ రెండు కండీషన్లకు కేంద్రం హామి ఇచ్చిందా? ఏపీ హామి ఇచ్చిందా? నీ అప్రువల్ తోనే లెటర్ పోయింది కదా ఉత్తం గారు ఎందుకు హామి లేకుండా పాల్గొంటున్నారు. తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే రేవంత్ రెడ్డి పట్టించుకోడు, మీరైనా ఎందుకు పట్టించుకోరు ఉత్తం గారు. ఈ మీటింగ్ కు వెళ్లేది ఆదిత్యా నాథ్. గతంలో 9వ గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డు మీటింగ్ లో పాల్గొన్న ఆదిత్యా నాథ్ దాస్, కాళేశ్వరం, గోదావరి, సీతారామ లిఫ్ట్ ప్రాజెక్టు, తుపాకులగూడెం, మిషన్ భగీరథ, చనాక కొరటా, రామప్ప డైవర్షన్ లు అన్నీ అక్రమ ప్రాజెక్టులు, వీటిని నిలిపి వేయాలని చెప్పాడని అన్నారు.

తెలంగాణ ప్రాజెక్టులను అడుగడుగునా వ్యతిరేకించిన వ్యక్తిని మీటింగ్ కు పంపడం అంటే తెలంగాణ ద్రోహం చేయడానికే కదా? మన తెలంగాణ నీళ్లను ఏపీకి తీసుకువెళ్లే కుట్ర ఇది. తెలంగాణ సోయి ఉన్న ఒక్క ఇంజినీర్ దొరకలేదా? దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు చేస్తున్నారు. పోను పోను అంటూనే మీటింగ్ లకు అటెండ్ అవడం అంటే ఏమిటి? తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్ప చెప్పడమేనా మీ చర్చల లక్ష్యమా? కేసీఆర్ గోదావరిలో 400 టిఎంసీలు కేంద్రం నుంచి అనుమతులు తెచ్చారు. గోదావరి మీద 10 డిపిఆర్ లు పంపి 7 ప్రాజెక్టులకు అనుమతులు సాధించారు. రెండేళ్లలో ఒక్క డిపిఆర్ పంపింది లేదు, ఒక్క అనుమతి తెచ్చింది లేదు. వార్ధా, కాళేశ్వరం మూడో టిఎంసీలకు సగం అనుమతులు వస్తే, పూర్తి చేయకుండా డీపీఆర్ లు వాపస్ చేసింది. నల్లమల సాగర్ కు జెండా ఊపుతవు. అలాంటి చంద్రబాబుతో దోస్తీ కట్టి, తెలంగాణకు తీరని అన్యాయం చేసేందుకు సిద్ధమైన రేవంత్ రెడ్డి నిన్ను తెలంగాణ సమాజం క్షమించదు. తెలంగాణ నీటి హక్కులను కాలరాసేందుకు ఏపీ ఒత్తిడితో కేంద్రం నిర్వహిస్తున్న ఈరోజు ఢిల్లీ సమావేశాన్ని బహిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం. నువ్వు పెట్టిన కండీషన్లకు వచ్చిన సమాధానం బయట పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. రేవంత్ రెడ్డి..నీ గురుదక్షిణ కోసం తెలంగాణకు ద్రోహం చేస్తుంటే తెలంగాణను సాధించిన బిఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని అన్నారు. నీ దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం మరో పోరాటం చేస్తం. కేసీఆర్ పాలన గురించి ఎకనామిక్ సర్వే రిపోర్టే స్పష్టం చేసింది. రెండు కోట్ల 20లక్షల ఎకరాల మాగాణిగా మారింది. కాళేశ్వరం, మిషన్ కాకతీయ ద్వారా అద్భుతమైన ఆయకట్టు వచ్చింది. కాళేశ్వరం ద్వారా 17 లక్షల 823 ఎకరాల స్థిరీకరణ, మిషన్ కాకతీయ ద్వారా పదిహేను లక్షల ఎకరాల ఆయకట్టు సాధ్యమైంది. 32 లక్షల ఎకరాల ఆయకట్టు బిఆర్ఎస్ సాధించింది. బండి సంజయ్, కిషన్ రెడ్డి ఇప్పటికైనా నోరు పారేసుకోవడం మంచిది. కళ్లు తెరవండి అనవసరంగా బిఆర్ఎస్ మీద నోళ్లు పారేసుకోకండి. మేమేమో తెలంగాణకు నీళ్లు ఇచ్చే ప్రయత్నం చేస్తే, రేవంతు ఏపీకి నీళ్లు ఇచ్చే ప్రయత్నం చేసిండు. నీటిని ఒడిసి పట్టింది కేసీఆర్ విడిచి పెట్టింది రేవంత్ సోయి లేని రేవంత్ నల్లమల సాగర్ కు జెండా ఊపుతున్నడు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం మీటింగ్ బాయికట్ చేయాలి. ఢిల్లీకి, దావోస్ కు తిరగడమే తప్ప పాలన మీద దృష్టి లేదు. బిఆర్ఎస్ సేద్యంపై దృష్టి సారిస్తే, రేవంత్ చోద్యం చూస్తున్నడని అన్నారు.

## చదువు అనేది గేమ్ ఛేంజర్

అమెరికాలో 18 ఏళ్లకే పిల్లలు బయటకు వెళ్లి స్వతంత్రంగా జీవిస్తారు. పిల్లలు ఎంత పెద్దవారైనా జీవితాంతం తల్లిదండ్రులు మెంటర్ చేయడం మనది. నిర్మాణం కోసం మీరు రూ.100 కోట్లు ఖర్చు చేశారు. అంతేకాదు దాన్ని మెయింటైన్ చేయడం కోసం కొంత డబ్బు బ్యాంకులో డిపాజిట్ చేయడం గొప్ప విషయమని అన్నారు. ఏపీలో మెడిసిన్ చేసిన ఎంతోమంది అమెరికా వెళ్లారు. నేను 1995లో సీఎం అయినప్పుడు చాలామంది చదువుకుని అమెరికా వెళ్లిపోతున్నారు బ్రెయిన్ డ్రెయిన్ అవుతోందని కొందరు అడిగారు. గుంటూరులో మిలీనియమ్ బ్లాక్ కోసం రూ.16 కోట్లు, విశాఖ ఏయూ మెడికల్ కాలేజీ సెంట్రియన్ బ్లాక్ కోసం రూ. 60 కోట్లు, కాకినాడ ఆస్పత్రికి రూ. 40 కోట్లు, కర్నూలు మెడికల్ కాలేజీకి రూ, 20 కోట్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఖర్చు పెడుతున్నారని అన్నారు. ఆనాడు నేను పిలుపు ఇచ్చిన జన్మభూమి కార్యక్రమానికి ఎంతోమంది ప్రవాసులు జన్మభూమికి సేవ చేశారు. ఇప్పుడు పీ4 కు పిలుపునిచ్చాం. కేంద్ర ప్రభుత్వం రహదారులు, ఎయిర్ పోర్టులు, విద్యుత్ రంగంలో వేగమైన అభివృద్ధికి పీ3 మోడల్ సరైన మార్గమని భావిస్తోంది. నేను అందుకే పీ4 తీసుకొచ్చాను. మనందరం గ్రామీణ ప్రాంతాల్లో చిన్న కుటుంబాల్లో పుట్టాం. అవకాశాలు ఉపయోగించుకుని అంచెలంచెలుగా ఎదిగాం. మీరంతా సమాజానికి కొంత తిరిగి ఇస్తున్నారు. పేదలు రూ.10 సంపాదించుకునే అవకాశాలు వస్తేనే సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గుతాయని అన్నారు. చదువు అనేది గేమ్ ఛేంజర్. అంబేద్కర్కు ఆనాడు బరోడా రాజు ఆర్థిక సాయం చేశారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాసి మనదేశంపై చెరగని ముద్ర వేశారు. అబ్దుల్ కలామ్ కి అయ్యంగార్ సాయం చేశారు. బ్రాహ్మణులు... ముస్లింలకు సాయం చేసేందుకు ఇష్టపడని రోజుల్లో కలామ్ ప్రతిభ చూసి ప్రోత్సహించారు. భారతరత్నకు మారుపేరుగా కలామ్ తయారయ్యారు. గుంటూరు మెడికల్ కాలేజీలో చదివివారిలో 8 మందికి పద్మశ్రీ అవార్డులు వచ్చాయి. సీఎం అబీబుల్లా, సోమరాజు, రావు, నాయుడమ్మ, ప్రసాదరావు, నరేంద్రనాథ్, గోపీచంద్, గోపాలకృష్ణ గోఖలే సేవలకు పద్మశ్రీ వచ్చింది. నా లెక్క ప్రకారం మన ఆంధ్రా మెడికల్ కాలేజీ మొదటిదైతే గుంటూరుది రెండో మెడికల్ కాలేజీ అనుకుంటున్నాను. పేదరికం లేకుండా చేయాలి, ఆర్థిక అసమానతలు తగ్గించాలని మార్గదర్శి బంగారు కుటంబాలు అనే విధానం తెచ్చాం. దీనికి 50 శాతం రీచ్ అయ్యాం. 10 లక్షల 42 వేల మందిని లక్షా 2 వేల మంది దత్తత తీసుకున్నారు. బంగారు కుటుంబాలు బాగుపడితే మార్గదర్శులుగా మారతారు. మీలో వీలైనంత మంది పేదలకు సాయం చేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# మరో యుద్ధం తప్పదా...





పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. వెనెజెవెలా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ కాంక్షతో రగిలిపోతున్నాడు. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంతో రగిలిపోతున్న ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే ఇరాన్‌కు పలుమార్లు వార్నింగ్ ఇచ్చాడు. ఇక ఇప్పుడు వార్‌కు రెడీ అవుతున్నాడు. ఆయుధాలు మోహరిస్తున్నాడు. ఇప్పటికే పాకిస్తాన్ బలగాలను ఇరాక్ సరిహద్దుకు తరలించాడు. అమెరికా యుద్ధ విమానాలను రెడీ చేశాడు. తాజాగా అమెరికాకు చెందిన అబ్రహాం లింకన్ వాహక నౌక ఇటీవల ఇక్కడికి చేరింది. దీనితో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ. పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ కూడా ఇరాన్‌కు తరలించాడు. పశ్చిమసియాలో మొన్నటిదాకా ఇజ్రాయిల్, పాలస్తీనా దేశాల మధ్య దాడులు కొనసాగేవి. ఈ రెండు దేశాల మధ్యలోకి ఇరాక్, సిరియా కూడా వచ్చాయి. దీంతో దాడులు మరింత పెరిగిపోయాయి. ఇప్పుడు అక్కడ పరిస్థితులు నెమ్మదిగా మారిపోతున్న వేళ.. పశ్చిమసియాలో మరోసారి యుద్ధ వాతావరణం ఏర్పడిందిఅమెరికాకు చెందిన యుద్ధ విమాన వాహన నౌక యుఎస్ఎస్ అబ్రహాం లింకన్ పశ్చిమాసియా కు చేరుకోవడం కలకలాన్ని కలిగిస్తోంది. దీంతో ఇరాన్ పై అమెరికా దాడులు చేసే అవకాశం ఉందని ప్రచారం మొదలైంది.అబ్రహం లింకన్ యుద్ధ విమాన వాహక నౌక మాత్రమే కాకుండా, యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ వంటి యుద్ధ విమాన వాహక నౌకలు ఇరాన్ సరిహద్దుల్లోకి వెళ్లినట్టు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే అమెరికాకు చెందిన సెంట్రల్ కమాండ్ ఈ యుద్ధ విమాన వాహక నౌకలు అక్కడికి వచ్చాయని తెలిపింది.ఈ విమానాలు ఇరాన్ సరిహద్దుల్లోని అరేబియా సముద్రంలో ల్యాండ్ అవ్వలేదు. హిందూ సముద్రంలో అవి దిగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇది మాత్రమే కాకుండా యుద్ధ విమానాలను, కార్గో విమానాలను ఈ ప్రాంతానికి తీసుకొస్తున్నట్టు తెలుస్తోంది. కొంతకాలంగా ఇరాన్ దేశంలో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. ఘర్షణలో జరుగుతున్న నేపథ్యంలో వేరాదిమంది ఇప్పటికే చనిపోయారు. అక్కడి ఆందోళనలకు ట్రంప్ బాసటగా నిలిచారు. ఒకవేళ అక్కడి ప్రభుత్వం ఆందోళనకారులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటే మాత్రం తాము రంగంలోకి దిగుతామని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ చేసిన వ్యాఖ్యల తర్వాత అమెరికా సైన్యం భారీగా ఇరాన్ దిశగా వెళ్లడం రకరకాల సంకేతాలు ఇస్తుంది.

ట్రంప్ ఆదేశాలు ఇచ్చిన మరుక్షణంలోనే ఇరాన్ మీద అమెరికా దాడి చేసే అవకాశాలు తెలుస్తోంది. మరోవైపు అమెరికాతో ఇరాన్ చర్చలు జరిపే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. చర్చలు ముందుకు సాగితే పరిణామాలు వేగంగా మారిపోతాయని అంతర్జాతీయ విశ్లేషకులు చెబుతున్నారు.యూఎస్ సెంట్రల్ కమాండ్ దీనిని నిర్ధారించింది. ప్రాంత స్థిరత్వం, భద్రతా కారణాల దృష్ట్యా ఈ చర్యలు తీసుకున్నామని తెలిపింది. ఈ నౌబల బృందం ఆరబియా సముద్రం సరిహద్దుల్లో మాత్రమే కాక, హిందూ మహాసముద్రంలో కూడా వెళ్లేందుకు సిద్ధమవుతోంది. ఫలితంగా, ప్రాంతంలో అమెరికా సైనికుల సంఖ్య గణనీయంగా పెరిగింది.పెంటగాన్ ఇంకా ఎక్కువ ఫైటర్ జెట్‌లు, సైనిక కార్గో విమానాలను ఈ దిశలోకి తరలించే యోచనలో ఉంది. ఇరాన్‌లో పొలిటికల్ అస్థిరతలు, ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో వేల మంది మరణించినట్లు అంచనా. ఆందోళనలకు మద్దతుగా నిలబడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రభుత్వం ఏమైనా కఠిన చర్యలు తీసుకుంటే జోక్యం చేసుకుంటామని హెచ్చరించారు. దీని ఫలితంగా భారీ సైనిక బలగాలను రెడీ చేస్తున్నామని ప్రకటించారు. ఇది రెండు దేశాల మధ్య ఉద్రిక్తాలను మరింత పెంచింది.ఒకవైపు యుద్ధ విమానాలు, నౌకలను మోహరిస్తున్న అమెరికా.. మరోవైపు ఇరాన్ చర్చలకు ముందుకు వస్తే తాము సిద్ధమని అమెరికా అధికారి తెలిపారు. వెనెజువెలాపై సైలెంట్ ఆపరేషన్ సక్సెస్ అయిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ కాంక్షతో రగిలిపోతున్నాడు. ఈ క్రమంలో ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభంతో ప్రజలు నిరసనలు తెలుపుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమవుతున్నాడు. ఖమేనీ ప్రభుత్వాని మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు, ఈమేరకు హెచ్చరికల మీద హెచ్చరికలు చేస్తున్నాడు. దీంతో నిరసనకారులు కూడా అమెరికావైపు ఆశగా చూస్తున్నారు. గతంలో ఒకసారి దాడి చేసిన అమెరికా ఈసారి పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధమవుతోంది.అమెరికా అబ్రహం లింకన్ యుద్ధ నౌకను ఇరాన్ దిశగా పంపుతోంది. శుక్రవారానికి సిద్ధంగా ఉండాలని ఇరాన్ నౌకలను అడ్డుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇజ్రాయెల్ దళాలు కూడా అలర్ట్‌లో ఉన్నాయి. దీంతో అమెరికా ఇరాన్ డోమ్ యాక్టివేట్ చేసి, ఎయిర్ స్ట్రైక్‌లకు సిద్ధపడుతోంది. అమెరికాతో కలిసి దాడికి ఇజ్రాయెల్ కూడా రెడీ అయింది. భూమిపై నుంచి దాడులు చేయకుండా ఎయిర్ స్ట్రైక్‌లు చేయాలని అమెరికా భావిస్తోంది. భూతల దాడులు చేస్తే ఐఆర్‌జీసీ అడ్డుకుంటుంది. అమెరికా సైనికులను చంపే ప్రమాదం ఉంది. అందుకే అమెరికా ఐఆర్‌జీసీని తీవ్రవాద సంస్థగా ప్రకటించింది. ప్రపంచ దేశాలతోనూ ప్రకటింపజేసి ఇరాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడి పెంచింది.తాజా పరిణామాల నేపథ్యంలో చైనా సంచలన ప్రకటన చేసింది. ఇరాన్‌పై యుద్ధం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించింది. పాలస్తీన, గత ఇరాన్ దాడుల సమయంలో ఇలాంటి స్టేట్‌మెంట్‌లు జారీ చేసింది. అయినప్పటికీ, ఇరాన్‌కు సరైన మద్దతు ఇవ్వకుండా బెదిరింపులకు మాత్రమే దిగుతోంది.ఈ టెన్షన్ చమురు ధరలు, గ్లోబల్ ట్రేడ్‌ను ప్రభావితం చేస్తాయి. చైనా హెచ్చరిక అమెరికా వ్యూహాలను ప్రశ్నిస్తూ, మధ్యప్రాచ్య స్థిరత్వానికి సవాల్‌గా మారింది. దౌత్య ప్రయత్నాలు ఫలిస్తాయా అనేది ఆసక్తికరం.టెహ్రాన్‌కు చర్చలు సాగించేందుకు అవసరమైన అడుగులు ఇప్పటికే తెలుసని చెప్పారు. మొత్తంగా పశ్చిమాసియాలో మళ్లీ అలజడి మొదలైంది.



## తెలంగాణలో వ్యవసాయం భేష్

- 2014 నుంచి 2023 మధ్యలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు భూమి విస్తీర్ణం
- తొమ్మిదేళ్లలోనే దాదాపు కోటి ఎకరాల అదనపు భూమి సాగులోకి రావడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భారీ నీటి పారుదల ప్రాజెక్టులు

**జయభేరి, హైదరాబాద్, జనవరి 30 :**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో తెలంగాణ వ్యవసాయ రంగం సాధించిన ప్రగతి ప్రత్యేక గుర్తింపు పొందింది. 2014 నుంచి 2023 మధ్యలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు భూమి విస్తీర్ణం.. ప్రస్తుతం 2.21 కోట్ల ఎకరాలకు చేరుకోవడం గమనార్హం. కేవలం తొమ్మిదేళ్లలోనే దాదాపు కోటి ఎకరాల అదనపు భూమి సాగులోకి రావడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భారీ నీటి పారుదల ప్రాజెక్టులు ప్రధాన కారణంగా నిలిచాయి. ముఖ్యంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం మరియు మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ వంటి చర్యలు భూగర్భ జలమట్టాన్ని పెంచి, బీడు భూములను సైతం పచ్చని పొలాలుగా మార్చాయి. పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా ఆర్థిక సర్వే నివేదికలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగానికి సంబంధించి ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. గత తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్రంలో సాగు యోగ్యమైన భూమి విస్తీర్ణం ఊహించని రీతిలో పెరగడం విశేషం. సాగు విస్తీర్ణం పెరగడమే కాకుండా.. రాష్ట్ర జీడీపీలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తున్నట్లు సర్వే స్పష్టం చేసింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో అంటే.. 2014 నుంచి 2023 మధ్య వరకు రాష్ట్రంలో సాగు యోగ్యమైన భూమి విస్తీర్ణం కేవలం 1.31 కోట్ల ఎకరాలుగా ఉండేది. ప్రస్తుతం ఏకంగా 2.21 కోట్ల ఎకరాలకు చేరుకుందని సర్వేలో పేర్కొన్నారు. అంటే దాదాపు ఒక కోటి ఎకరాల అదనపు భూమి కొత్తగా సాగులోకి వచ్చింది. ఇది దేశంలోని మరే రాష్ట్రంలోనూ లేని విధంగా నమోదైన అతిపెద్ద వృద్ధిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. సాగు విస్తీర్ణం ఇంతలా పెరగడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బహుళార్థసాధక ప్రాజెక్టులు, జలవనరుల నిర్వహణ ప్రధాన కారణాలుగా ఆర్థిక సర్వే పేర్కొంది. అందులో ఒకటి మిషన్ కాకతీయ.. గ్రామాల్లోని చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలమట్టం భారీగా పెరిగింది. దీనివల్ల బావులు, బోర్ల కింద సాగు పెరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు .. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా పేరుగాంచిన కాళేశ్వరం ద్వారా గతంలో ఎడారిగా ఉన్న ప్రాంతాలకు కూడా సాగునీరు అందింది. వీటితో పాటు.. చెక్ డ్యామ్‌ల నిర్మాణం , కాలువల ఆధునీకరణ ద్వారా చిట్టచివరి భూములకు కూడా నీరు చేరుతోంది. వీటి ఫలితమే.. సాగు భూమి విస్తీర్ణం అధికంగా పెరిగింది. ఇటీవల ప్రవేశపెట్టిన భూ భారతి ద్వారా.. భూ రికార్డుల ప్రక్షాళన, రెవెన్యూ , రిజిస్ట్రేషన్ విభాగాల ఏకీకరణ వల్ల భూ యజమానులకు స్పష్టత వచ్చింది. ఇది రైతులు తమ భూములను మరింత సమర్ధవంతంగా సాగు చేసుకునేలా ప్రోత్సహించింది. వ్యవసాయంతో పాటు తయారీ రంగంలో తెలంగాణ 5 శాతం వాటాను నమోదు చేసింది. ఇక ఐటీ, ఫైనాన్స్ సర్వీసులలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులతో కలిసి తెలంగాణ దేశంలో 40 శాతం వాటాను కలిగి ఉంది. ఏఐ స్టార్టప్‌లలో తెలంగాణ 7 శాతం వాటాతో దూసుకుపోతోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. 2035 నాటికి హైదరాబాద్ జీడీపీ 201.1 బిలియన్ డాలర్లకు చేరుతుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. మున్సిపల్ బాండ్ల జారీలో కూడా హైదరాబాద్ అగ్రస్థానంలో నిలవడం గమనార్హం. సాగు విస్తీర్ణం పెరుగుదల కేవలం ఆహార భద్రతనే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కూడా బలోపేతం చేస్తోందని నివేదిక పేర్కొంది.

## ఏఐపై మోడీ మేధోమధనం

- ఫిబ్రవరిలో జరగనున్న ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్
- భారత్‌ను గ్లోబల్ ఏఐ హబ్‌గా మార్చాలనివిజ్ఞప్తి
- ఏఐ అభివృద్ధిలో కేవలం వేగం మాత్రమే కాదు.. భద్రత, పారదర్శకత కూడా ముఖ్యమని మోదీ స్పష్టం

**జయభేరి, న్యూఢిల్లీ, జనవరి 30 :**



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని శాసిస్తున్న తరుణంలో భారత్ ఈ రంగంలో అగ్రగామిగా ఎదగడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక అడుగులు వేస్తున్నారు. లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని తన నివాసంలో దేశంలోని దిగ్గజ టెక్ కంపెనీల సీఈవోలు, ఏఐ నిపుణులతో ప్రధాని ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఫిబ్రవరిలో జరగనున్న ఇండియాఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ నేపథ్యంలో ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. భారతదేశం యూపీఐ ద్వారా ప్రపంచానికి తన సాంకేతిక నైపుణ్యాన్ని ఇప్పటికే నిరూపించుకుందని.. ఇప్పుడు ఏఐ రంగంలో కూడా అలాంటి విజయాలు సాధించాలని ప్రధాని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో స్వదేశీ ఏఐ సాంకేతికతను ప్రోత్సహించాలని, టెక్నాలజీలో స్వావలంబన సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. భారత్ వద్ద ఉన్న డేటా వైవిధ్యం, ప్రజాస్వామ్య విలువలు ప్రపంచ దేశాలకు మనపై నమ్మకాన్ని కలిగిస్తాయని, అందుకే భారత్‌ను గ్లోబల్ ఏఐ హబ్‌గా మార్చాలనివిజ్ఞప్తి చేశారు. ఏఐ అభివృద్ధిలో కేవలం వేగం మాత్రమే కాదు.. భద్రత, పారదర్శకత కూడా ముఖ్యమని మోదీ స్పష్టం చేశారు. ఏఐ దుర్వినియోగం కాకుండా దాని వినియోగం పారదర్శకంగా, న్యాయంగా ఉండేలా పటిష్టమైన పర్యావరణ వ్యవస్థను సృష్టించాలని సూచించారు. యువతలో ఏఐనైపుణ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని నిపుణులను కోరారు .ఈ సమావేశంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , విప్రో, హెచ్ సీఎల టెక్, జోహో కార్పొరేషన్, జియో ప్లాట్‌ఫామ్స్, అదానీ కనెక్స్ వంటి దిగ్గజ కంపెనీలతో పాటు.. ఐఐటీ మద్రాస్, ఐఐటీ బాంబే, ఐఐటీ హైదరాబాద్ నిపుణులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, రాజీవ్ చంద్రశేఖర్ కూడా ఈ చర్చల్లో భాగస్వాములై, ప్రభుత్వ మద్దతును వారికి వివరించారు.

## కోస్గి ఎస్ఐ కు కోన రాజశేఖర్ ఘన సన్మానం

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా కోస్గి ఎస్ ఐ ఆంజనేయులును శుక్రవారం జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర మేదరి మహేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి కోన రాజశేఖర్ ఘనంగా సన్మానించారు. ఎస్ఐ ఆంజనేయులు పదవి విరమణ పొందారు. అయితే అక్కడ ఏర్పాటుచేసిన ఆయన పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి కోన రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కోన రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజాశాంతి భద్రతల పరిరక్షణలో ఎస్ ఐ ఆంజనేయులు అంకితభావంతో, నిజాయితీగా పనిచేశారని ప్రశంసించారు. కోస్గి పట్టణంలో విధి నిర్వహణలో క్రమశిక్షణతో పాటు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ఆదర్శవంతమైన పోలీస్ అధికారిగా ఎస్ ఐ ఆంజనేయులు మంచి గుర్తింపు పొందారన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయన జీవితంలో ఆరోగ్యం, శాంతి, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోన రాజశేఖర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పదవి విరమణ పొందిన ఎస్ ఐ ఆంజనేయులును కోన రాజశేఖర్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రముఖులు, అభిమానులు తదితరులు కూడా పాల్గొని పదవి విరమణ పొందిన ఎస్ ఐ ఆంజనేయులుకు కూడా సన్మానించి శుభాకాంక్షలు తెలిపినట్లు కోన రాజశేఖర తెలిపారు.

# ప్రజా ప్రభుత్వంలో విద్యకు పెద్ద పీఠ

- తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- మంత్రులకు ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- 150 వ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- మెరుగైన విద్య కోసం ప్రభుత్వం ఇదివరకే 10 కోట్లు కేటాయించిందన్న మంత్రులు
- కార్యక్రమంలో పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రజా ప్రతినిధులు, ఉన్నత అధికారులు,మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు



**జయభేరి, షాద్ నగర్ :**

ప్రజా ప్రభుత్వంలో విద్యకు పెద్ద పీటవేశామని మెరుగైన విద్య అందించాలని ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని మొగిలి గిద్ద పాఠశాల 150 వ వార్షికోత్సవ కార్యక్రమంకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఎందరో మేధావులను అందించిన చరిత్ర కలిగిన పాఠశాల మొగిలిగిద్ద గేదెక్కిందని అన్నారు. బూర్గుల రామకృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి, టీ. అంజయ్య, ప్రొఫెసర్ హర గోపాల్ వంటి విద్యావంతులను ఎందరో మేధావులు ఉన్నత స్థాయికి ఎదిగారని మొదట ఉర్దూ మీడియం ఆ తర్వాత తెలుగు మీడియం వై ఎస్ రాజశేఖర్ పాలనలో ఇంగ్లీష్ మీడియంలో అనేకమంది మేధావులను తయారుచేసిన పాఠశాలగా పేరుపొందిందని అన్నారు.

**భూ పోరాటాలు భూసంస్కరణల ఘనత బూర్గుల రామకృష్ణారావు..**

దున్నేవాడిదే భూమి అని భూమిపై పెత్తనం చలాయించే వారిపై అనేక ఉద్యమాలు చేసి భూ సంస్కరణలకు నాంది పలికిన నేత బూర్గుల రామకృష్ణారావు అని అన్నారు.పరుగెడుతున్న ప్రపంచంలో తెలుగుతో పాటు ఆంగ్ల విద్య ఎంతో అవసరం.. పరిగెడుతున్న పోటీ ప్రపంచంలో తెలుగు విద్యతో పాటు ఆంగ్ల విద్యను కూడా విద్యార్థులు ప్రశ్నించాలనే ఉద్దేశంతో ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశ పెట్టారని అది ఇప్పుడూ అందరికి ఇంతగానో ఉపయోగపడిందని అన్నారు.

**యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టాం ప్రతి పాఠశాలకు 200 కోట్లు మంజూరు.. 100 స్కూల్ ఒకేసారి ప్రారంభించాం..**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఒకేసారి 100 ప్రతి పాఠశాలకు 200 కోట్లు నిధులు మంజూరు చేసి ప్రారంభించామని అన్నారు. ప్రైవేటు విద్య కంటే ప్రభుత్వ విద్య మెరుగైనదిగా తీర్చిదిద్దాలని ఏకైక సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి, కేబినెట్ మంత్రులు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచించి తీసుకున్న ఒక గొప్ప నిర్ణయమని అన్నారు. విద్యతోపాటు ఆసుపత్రులు కూడా అన్ని రంగాలలో మెరుగైన వస్తువులు కల్పిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

**మహిళా సంఘుల ద్వారా వడ్డీ లేని రుణాలు ఏడాదిలో 27వేల కోట్లు అందించాం..**

మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఏకంగా 27 వేల కోట్ల రూపాయలు ఏడాదిలోనే చెక్కుల ద్వారా ఆర్థిక అభివృద్ధి కోసం మంజూరు చేశామని అన్నారు. మహిళల అభివృద్ధి వారి కుటుంబ సంక్షేమం కోసం ప్రజాపాలనలో మహిళలకు పెద్ద పీఠవేశామని వడ్డీరేని రుణాల ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో రుణాలు మంజూరు చేశామని అన్నారు.

**పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేస్తాం..**

నీటికి ఇటువంటి కొరత లేకుండా పాలమూరు రంగారెడ్డినీటి ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడానికి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి నో విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రభుత్వం అన్ని విధాలుగా పూర్తిస్థాయిలో కృషిచేసి తొందర లేనా ప్రాజెక్టులను పూర్తి చేస్తామని అన్నారు. ప్రతి గ్రామానికి ఇలాంటి నీటి కొరత లేకుండా ప్రతి పల్లె సుఖశాంతులతో విరసిల్లాలని రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళలా అభివృద్ధికి నూతన విధివిధానాలతో కొనసాగుతున్నామని అన్నారు.



రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉత్తర తెలంగాణలో అక్కడ సమ్మక్క సారక్క మేడారం జాతర ఇక్కడ ఘనంగా వారోత్సవాలు. ప్రొఫెసర్ హారగోపాల్ పిలుపుమేరకు మొగలిగిద్ద పాఠశాల కార్యక్రమానికి హాజరయ్యాను మంత్రి పొన్నం ప్రభాకర్.

**చరిత్ర ఎప్పడు ప్రస్తుతానికి కులమానం మాత్రమే..**

చరిత్ర ఎప్పుడు కూడా ప్రస్తుతానికి ఒక కొలమానమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మొగిలిగిద్ద పాఠశాల ఎంతో చరిత్ర కలిగినది.. మొగలిగితే పాఠశాల తూరాజ్ ఖాన్ పరిపాలనలో గఢీలుగా ఉండి పాఠశాలగా మారిందని అన్నారు. పంచవర్ష ప్రణాళికల వాళ్ళ దేశంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు.

**ప్రొఫెసర్ హరగోపాల్ పాత్ర ఎంతో కీలకమైనది..**

రాజకీయాలకు అతీతంగా విద్యలో మార్పులు తీసుకువస్తామన్న మంత్రి పున్నం ప్రభాకర్. ప్రొఫెసర్ హరగోపాల్ పాత్ర కూడా ఎంతో కీలకమైనదని, ప్రతినిత్యం ప్రత్యేకమైన శ్రద్ధతో నైపుణ్యమైన విద్యను అందించి విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దాలని ఆయన అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తుంటారని అన్నారు.



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. చారిత్రక గ్రామం మొగిలిగిద్ద స్వతంత్రానికి పూర్వకమే ప్రభుత్వ పాఠశాల ఏర్పడిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 150 వ వార్షికోత్సవ కార్యక్రమం జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ప్రొఫెసర్ హారగోపాల్ విద్యపై ఎంతో దృష్టి సారించి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంతో ఏటిసి అడ్వాన్సుడ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ ను కొందూరులో ఇదివరకు ప్రారంభించామని అన్నారు. ఎందరో మేధావులు బూర్గుల రామకృష్ణారావు, మరి చెన్నారెడ్డి, అన్నారం సత్యనారాయణ, వంటి విద్యావేత్తలు ఈ గ్రామం నుంచి ఈ పాఠశాలలో చదివి ఉన్నత పేరు సంపాదించాలని అన్నారు.

**గతంలో కనీసం మూత్రశాలలు కూడా లేని దుర్మార్గపు పరిస్థితి**

గత పది సంవత్సరాల క్రితం విద్యకు పూర్తిగా తావు లేకుండా కేవలం లిక్కర్కు మాత్రమే గత ప్రభుత్వం దేనికి ప్రాధాన్యం ఇచ్చిందో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. కనీసం మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఎంతో ఇబ్బంది పడ్డారని తమ దృష్టికి ఆ సంవత్సరాగా వెంటనే మరుగుదొడ్లను ఏర్పాటు చేశామని తాము చిత్తశుద్ధితో విద్య పైన ఇలాంటి దృష్టి పెట్టాము అనేది ప్రజలు అందరు గ్రహించాలని అన్నారు.
విద్యాహబ్ గా మొగిలిగిద్ద గ్రామాన్ని తీర్చిదిద్దుతాం.. విద్యాహబ్ గా భవిష్యత్తులో మొగిలిగిద్ద గ్రామాన్ని విద్యా హబ్ గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ప్రొఫెసర్ హారగోపాల్ అన్ని విజ్ఞప్తిలను సకాలంలో పూర్తి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ప్రొఫెసర్ హర గోపాల్ మాట్లాడుతూ..150 ఏళ్ల చరిత్రలో ఆనాటి సీఎం చంద్రబాబు నాయుడు జూనియర్ కళాశాలను మంజూరు చేశారని అప్పుడు వందేళ్ళ వసంతాలు జరుపుకున్నామని అన్నారు. ఇప్పుడు 150వ వార్షికోత్సవం ఎంతో ఆనందాన్ని కలగజేస్తుందని అన్నారు.

**ప్రైవేటు విద్యకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య..**

సమాజంలో కార్పొరేట్ విద్యకు ఆసక్తితో ఎంతగానో ఖర్చు చేసి తల్లిదండ్రులు ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులను చదివిస్తున్నారని అన్నారు. కార్పొరేట్ విద్య కుటుంబానికి తల్లిదండ్రులకు ఎంతగానో భారంగా మారిందని అన్నారు. ప్రైవేటు విద్య కంటే మెరుగైనదిగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకొని ప్రైవేటు పాఠశాలలో ఉన్న వసుతులకు రెట్టింపు వసతులు కల్పించి విద్యార్థులకు మానసతో కూడిన విద్యను అందిస్తుందని అన్నారు. దానికి సంబంధించిన అన్ని విధివిధానాలు ఉన్నత అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని కోరారు.

**ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వానికి ఎఫెక్ట్ గా మారాయి..**

కార్పొరేట్ విద్య ప్రభుత్వ విద్య ఎంతో ఆటంకం కలిగిస్తుంది అని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. బ్రెజిల్ లో కేవలం విద్యకు 25% బడ్జెట్లో నిధులు కేటాయించాలని గుర్తు చేశారు. విద్యారంగంను ఎట్టు పరిస్థితిలోనూ నిర్లక్ష్యం చేయవద్దని అధిక నిధులు ముందు విద్యకు వైద్యానికి ఖర్చు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. వచ్చే బడ్జెట్ లో అధిక నిధులు విద్య వైద్యానికి అందించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి, ఆర్డీవోలు, ఎంపీడీవో, ఎమ్మార్వో, ఎంఈఓ, మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపీటీసీ, గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళా సంఘం మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏషామోని కృష్ణయ్య మాట్లాడుతూ.. మొగిలి గిద్ద పాఠశాల 150వ వారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రజా ప్రతినిధులకు, ఉన్నత అధికారులకు, కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మొగిలిగిద్ద గ్రామాన్ని మండలంగా తీర్చిదిద్ది అన్ని ఉన్నతమైన అవకాశాలను కల్పించాలని సభాముఖంగా కోరారు. తమ గ్రామానికి ఎంతో చరిత్ర ఉందని అలాంటి చరిత్ర గల గ్రామము మండలంలో ఏర్పాటు చేస్తే మరింతగానో అభివృద్ధి చెందడానికి అవకాశాలు లభిస్తానని గ్రామంలో ఉన్నటువంటి తను సమస్యలను మంత్రులకు ఎమ్మెల్యేకు తెలిపిన గ్రామ సర్పంచ్ కృష్ణయ్య.

# దేవదేవుడి బ్రహ్మోత్సవం

- సింహ, అశ్వవాహనంపై దర్శనమిచ్చిన స్వామి వారు
- కన్నులపండువగా ఎదుర్కోళ్ల మహోత్సవం

**జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 30 :**




యాదగిరిగుట్ట దేవస్థానం అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన శుక్రవారం ఉదయం స్వామి వారు సింహవాహనం, సాయంత్రం అశ్వవాహనంపై ఆలయ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం నిత్యారాధనల అనంతరం హవనం నిర్వహించి స్వామి, అమ్మవార్లను అలంకరించి సింహవాహన సేవలో ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఆలయంలో నిత్యారాధనల అనంతరం అనంతరం అశ్వవాహనంపై స్వామి వారి వేంచింపజేసి మేళతాళాల మధ్య ఆలయ మాఢావీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.



**ఎదుర్కోళ్ల మహోత్సవం..**


స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎదుర్కోళ్ల మహోత్సవం కన్నులపండువగా జరిగింది. అశ్వవాహనంపై స్వామి, అమ్మవార్లను తీసుకొచ్చి ఉత్సవ మండపంలో అధిష్టింపజేశారు. అనంతరం స్వామి వారి తరపున కొందరు అర్చకులు, అమ్మవారి తరపున కొందరు అర్చకులు చేరి ఎదుర్కోళ్ల తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి తరపున అర్చకులు ధైర్యసాహసాలు పొగుడుగా, అమ్మవారి తరపున అర్చకులు అందచందాలు, గుణగణాలు వివరిస్తూ ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఎదుర్కోళ్లను పురస్కరించుకొని భారీగా తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ్మామూర్తి, అధికారులు, సిబ్బంది, భక్తులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# కనబడుట లేదు

**జయభేరి, హయత్ నగర్ :**

చిర్రగోని మదారు, తండ్రి రాములు (69), కులం యాదవ్, వడ్డెర బస్తి మునగనూరు గ్రామం ఇట్టి వ్యక్తి తేదీ o4.1.2026 రోజు రాత్రి సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ వ్యక్తికి మతిస్థిమితం లేదు. అంగా వైకల్యము కలదు సరిగా మాట్లాడలేదు. ఇతని ఆచూకీ తెలిసినచో హయత్ నగర్ పోలీస్ స్టేషన్ కు తెలియపరచగలరు. లేదా వారి కుటుంబ సభ్యులకు అయినా తెలియపరచగలరు. ఫోన్. నెంబర్ 8125163909.



## ఉపాధి హామీ పేరు మార్పుకు.. పెద్ద ఎత్తున పేద ప్రజలతో నిరసన

**జయభేరి, ఆలేరు, జనవరి 30 :**

మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం వల్ల భారత దేశంలోని పేదలు రెండు పూటల భోజనం చేసే పరిస్థితి వచ్చిందని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆలేరు మండలంలోని మందనపల్లి గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పేరు మార్పుకు నిరసనగా పెద్ద ఎత్తున పేద ప్రజలతో నిరసన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని మార్చే కుట్రలు చేస్తోందన్నారు. 201920 సంవత్సరంలో ఆర్థిక సంక్షోభం ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతదేశంలో సంక్షేమం రాకపోవడానికి కారణం ఉపాధి హామీ పథకమే అన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెంచే ఇలాంటి పథకాల వల్ల పేదలు అభివృద్ధి చెందుతారని అన్నారు. మోడీ ప్రభుత్వం బిజెపి పాలనలో కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలపై భారాలు మోపి, పని దినాలను తగ్గించే ప్రయత్నం చేస్తుందన్నారు. దీనివల్ల గ్రామాల్లో ఉన్న పేదలు దిగువ స్థాయి రైతులు నష్టపోతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య,భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మహిళా, సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ్రు శోభారాణి, టిపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, పల్లే శ్రీనివాస్ గౌడ్, మందనపల్లి గ్రామ సర్పంచ్ సిరిమర్తి రేణుక నరసయ్య, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐన్యాల చైతన్య, మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ, ఆలేరు మండల పార్టీ అధ్యక్షులు కొండ్రోజు వెంకటేశ్వర రాజు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మందనపల్లి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ పూర్తి



**జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 30:**

మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. యాదగిరి గుట్ట మున్సిపాలిటీలో శుక్రవారం 41 నామినేషన్లు రాగా మూడు రోజుల్లో మొత్తం 77 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అస్టిసెంట్ అధికారి లింగస్వామి తెలిపారు. మూడు రోజుల్లో బీఎస్పీ నుంచి ఒకటి,బీజేపీ నుంచి 14,సీపీఐ నుంచి 2, కాంగ్రెస్ నుంచి 23, బీఆర్ఎస్ నుంచి 25, జేఎస్పీ నుంచి మూడు,స్వతంత్రులు 9 మొత్తం 77 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అసిస్టెంట్ అధికారి లింగ స్వామి తెలిపారు. మొత్తం 12 వార్డులకు శుక్రవారం ఒక్కరోజే కాంగ్రెస్ నుండి 10,బీఆర్ఎస్ నుండి 13,బీజేపీ నుంచి 7,సీపీఐ నుంచి ఒకటి,బీఎస్పీ నుంచి 1, జేఎస్పీ నుంచి 1,స్వతంత్రుల నుంచి 6 నామినేషన్లు వచ్చాయని మొత్తం 12వార్డులోని 77 నామినేషన్లు వచ్చినట్లు తెలిపారు.

## వీరారెడ్డిపల్లిలో ఎన్ఎస్ఎస్ క్యాంప్




**జయభేరి, తుర్కపల్లి, జనవరి 30 :**

తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం శ్రీనిధి కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తునికి లక్ష్మీ రామ్ రెడ్డి మాట్లాడుతూ క్యాంపులో భాగంగా ప్రతి వార్డులో పరిశుభ్రత, అవేర్నెస్, మెడికల్ క్యాంపు, ప్లాంటేషన్, కాంపిటీషన్, ఇంటింటి సర్వే అని నిర్వహించనున్నట్టు తెలిపారు. క్యాంపులో భాగంగా వీరారెడ్డిపల్లి గ్రామాన్ని ఎంచుకున్నట్లు గ్రామంలో ఏడు రోజుల పాటు గ్రామంలో ఉంటూ గ్రామీణ ప్రజలతో మమేకమై ఆర్గానిక్ వ్యవసాయంపై ప్రత్యేక టీం తో అవగాహన సదస్సు, క్లీన్ అండ్ క్లీన్ ప్రోగ్రాంలో భాగంగా పరిశుభ్రతపై గ్రామ ప్రజలతో సదస్సును నిర్వహిస్తానని, గ్రామంలో ప్రజల జీవనశైలి పై సర్వే నిర్వహించడం జరుగుతుందని, ప్రజల ఆరోగ్యంపై మెడికల్ క్యాంపు, విద్యార్థులకు ఆట పోటీలు నిర్వహణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు, ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింలు, వార్డు సభ్యులు మన్నే మహేష్ నల్ల మహేష్, కనకరాజు, నాగరాజు, అనురాధ, మాజీ సర్పంచ్ గోవిందుచారి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గజిటెడ్ హెచ్ఎం సత్యం, ఏవో తిరుమలరావు, పంచాయతీ కార్యదర్శి రాంకుమార్ నాయక్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, నాయకులు పరశురాం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిన్నెల్లిలో అనిల్ కుమార్ యాదవ్ భేటి

**జయభేరి, నెల్లూలరు :**

నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న పల్నాడు జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అయన సోదరుడు పిన్నెల్లి వెంకట రామిరెడ్డి వైకాపా నేత, మాజీ మంత్రి డాక్టర్ పి. అనిల్ కుమార్ యాదవ్ శుక్రవారం భేటి అయ్యారు.



## దేశవ్యాప్త సమయం జయప్రదం చేయాలి

**జయభేరి, తుర్కపల్లి, జనవరి 30 :**

ఫిబ్రవరి 12న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు పోతరాజు జహంగీర్ అన్నారు. శుక్రవారం గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీ ఓ వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందని అన్నారు. మోడీ అధికారం చేపట్టిన తర్వాత కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా మారి కార్మికులకు, కర్షకులకు వ్యతిరేకంగా వారి యొక్క చట్టాలను కాలరాస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు యూనియన్ మండల అధ్యక్షుడు ఎరుకల స్వామి గౌడ్, మండల నాయకులు పోతరాజు సత్యనారాయణ, కోట ఆంజనేయులు, మహేష్, తోటి మల్లయ్య, గడ్డమీది లక్ష్మి, ఈదులకంటి పోచమ్మ, తలారి మాధవి, సుశీల పాల్గొన్నారు.

## మండలంలో పశు ఆరోగ్య శిబిరాలు




**జయభేరి, పరవాడ:**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పశు ఆరోగ్య శిబిరాలలో భాగంగా శుక్రవారం పరవాడ మండలంలో రావాడ,పరవాడ, పెదముషిడివాడ గ్రామాలలో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ పరవాడ సబ్ డివిజన్ పరిధిలో పరవాడ సహాయ సంచాలకులు డా.రామకృష్ణ కీర్తి, వాడచీపురుపల్లి పశువైద్యులు డా.సురేష్ కుమార్ పోతిరెడ్డి,లంకెలపాలెం పశువైద్యులు డా.అనూష మట్టేల ఆధ్వర్యంలో ఈ శిబిరాలను నిర్వహించగా పరవాడ పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా.రామకృష్ణ కీర్తి ఈ శిబిరాలను పర్యవేక్షించారు. ఈ పశు ఆరోగ్య శిబిరాలలో పశువులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు సకాలంలో ఎదకు రాని పశువులకు వైద్యం అందిస్తారని డా.రామకృష్ణ కీర్తి తెలిపారు. అకాల మరణంతో జరిగే ఆర్థిక నష్టాన్ని నివారించేందుకు అత్యధిక సబ్సిడీతో పశు బీమా పథకాన్ని అమలు చేసేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది అని డా.రామకృష్ణ కీర్తి పశు పోషకులకు ఈ పథకం గురించి సంపూర్ణంగా వివరించారు. ఈ శిబిరాలలో పాడి రైతులు, పరవాడ పశువైద్య సిబ్బంది కాళ్ల శ్రీనివాస్, తూర్పాటి కృష్ణ, సిబ్బంది నందిని, దివ్య కిరణ్, పశు సంవర్ధక శాఖ సహాయకులు లక్ష్మణ్, భాస్కర్, పద్మ, శ్రీనివాస్, నూకరత్నం, గోపాలమిత్ర సన్యాసి నాయుడు, ట్రైనీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

## బొడ్డెడకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన పైల




**జయభేరి, పరవాడ:**

వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి పార్లమెంటు సమన్వయకర్త మరియు అరకు పార్లమెంటు పరిశీలకుడు బొడ్డెడ ప్రసాద్ జన్మదినం సందర్భంగా మునగపాక లో గల వారి కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల,పాయకరావు పేట నియోజకవర్గాల వైసీపీ పరిశీలకులు పైలా శ్రీనివాసరావు శాలువా తో సత్కరించి పూలమొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలియచేశారు .ఈ కార్యక్రమంలో పాల్గొని పైలతో పాటు పరవాడ మాజీ సర్పంచ్ ,వైస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామానాయుడు బొడ్డెడకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు ఈ కార్యక్రమంలో పరవాడ మండలం వైస్సార్సీపీ అధ్యక్షుడు కోన రామారావు,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పైలా జూనియర్ అప్పలనాయుడు, పైలా గరగ పైడంనాయుడు,చుక్క కాశి,ములకలపల్లి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో చివరి రోజు భారీగా నామినేషన్లు దాఖలు

- **అలియాబాద్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీలలో పోటాపోటీగా అభ్యర్థుల నామినేషన్లు**



**జయభేరి, శామీర్ పేట్ :**

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా అలియాబాద్, మూడుచింతల పల్లి మున్సిపాలిటీల పరిధిలో శుక్రవారంతో నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఆయా పార్టీల అభ్యర్థులు చివరి రోజు జోరుగా నామినేషన్లను దాఖలు చేశారు. ఇక అలియా బాద్ మున్సిపాలిటీలో మొత్తం 144 నామినేషన్లు దాఖలు అయినట్లు మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ వెల్లడించారు. ఇక మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో 175 నామినేషన్లు దాఖలు అయినట్లు కమిషనర్ పవన్ కుమార్ వెల్లడించారు.

# బిఆర్ ఎస్ పార్టీలోకి చేరికలు



**జయభేరి, దేవరకొండ :**

మున్సిపాలిటీ 6వ వార్డుకి చెందిన బీజేపీ పార్టీ నుంచి గడ్డం శివ దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. గత పదేండ్లలో కెసిఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని చూసే ప్రజలంతా మళ్ళీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చింది. అమలుకాని హామీలు, మోసపూరిత గ్యారెంటీలతో కాంగ్రెస్ గద్దెనెక్కికూర్చింది. రెండేళ్లలో పైసా పని చెయ్యని దద్దమ్మ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మున్సిపల్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి. బిఆర్ఎస్ హయంలో కేసీఆర్ గారి నాయకత్వంలోనే చిట్యాల అభివృద్ధి జరిగింది.

కేసీఆర్ ప్రభుత్వంలో నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 100కోట్లతో మున్సిపాలిటీలో అనేక పనులు చేపట్టాం. నాడైనా నేడైనా అధికారిక, రాజకీయ పదవుల్లో యువతకి పెద్ద పీట వేసింది బిఆర్ఎస్ పార్టీనే. కాంగ్రెస్ బెదిరింపులకు ఎవ్వరూ భయపడకండి మళ్ళీ రెండేళ్లలో వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే. రాజకీయ నాయకులను వేధించడానికే రేవంత్ రెడ్డి పోలీసులతో సిట్ ను ఏర్పాటు చేసుకున్నాడు. రాష్ట ఎన్నికల కమిషన్ కాంగ్రెస్ పార్టీకి తొత్తులా వ్యవహరిస్తుంది. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టిన కేసీఆర్ కి నోటీసుల పేరిట ఇబ్బందులు పెడుతున్న రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవికి అర్హుడు కాదు. డైవర్షన్, అటెన్షన్ పాలిటిక్స్ తో కాంగ్రెస్ మంత్రులు కాలయాపన చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీది ప్రజా పాలన కాదు ముమ్మాటికి కక్ష సాధింపు పాలన.


ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన దొంగ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలి. విజన్ తో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన కేసీఆర్ పాలనా గురుంచి ఇంకా దేశమంతా చర్చించుకుంటుంది. దేవరకొండ మున్సిపాలిటీలో ప్రతీ ఓటరు బిఆర్ఎస్ పార్టీ పై సానుకూల స్పందన కనబరుస్తున్నారు. దేవరకొండ మున్సిపాలిటీలో అన్ని వార్డులను బంపర్ మెజారిటీతో గెలిపించి కేసీఆర్ కి బహుమతిగా పంపుదాం. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ నేతలు నేనావత్ కిషన్ నాయక్, గాజుల ఆంజనేయులు, నీల రవికుమార్, పగడిమర్రి నాగరాజు, కర్నాటి రవి కుమార్, తదితరులు ఉన్నారు.



## దేవరకద్రలో ఘనంగా వాసవి మాత పల్లకి సేవ

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం వాసవి మాతా పల్లకి సేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం వాసవి మాత పల్లకి సేవ కార్యక్రమాన్ని దేవాలయంలో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు తరిమల హరిశంకర శర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో ఉదయం 8:30 గంటలకు అమ్మవారికి అభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే అమ్మవారి శ్రీ చక్రాలకు కుంకుమార్చన కార్యక్రమాన్ని,లలితా సహస్రనామ పారాయణం,అమ్మవారికి మహా మంగళ హారతి నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. పూజా కార్యక్రమానికి హాజరైన భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షు కల్వ కన్నయ్య శెట్టి,జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజుల రాణి,జిల్లా విశ్వహిందూ పరిషత్ మాజీ అధ్యక్షులు గుద్దేటి చంద్రయ్య, యువజన సంఘం అధ్యక్షుడు దోమ హరికాంత్ లతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ పంపిణీ



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా ఎంపీ యుపిఎస్ పెద్దరాజమూర్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అమెరికా ఎన్ఆర్ఐ మౌనిక క్రాంతి రెడ్డి సహకారంతో దాదాపు 60 రైటింగ్ ప్యాడ్స్ లను విద్యార్థులకు పంపిణీ చేశారు. దీంతో వారికి విద్యార్థులు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత ప్రసంగించారు. విద్యార్థులు ఈ రైటింగ్ ప్యాడ్స్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి కవితతో పాటు ఉపాధ్యాయులు కే.శంకర్, కే.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తాం

- **ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకొని పరిష్కరించేది కాంగ్రెస్ కౌన్సిలర్లే**
- **ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



**జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 30:**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, మున్సిపాలిటీల్లో కూడా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. శుక్రవారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల నామినేషన్ ర్యాలీలో బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని గుండ్లపల్లి దుర్గమ్మ గుడి దగ్గర నుంచి సాగిన ర్యాలీ పాదాల దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నామినేషన్ కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట పట్టణ అభివృద్ధి ప్రజా ప్రతినిధుల చేతుల్లోనే ఉందని,ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించగలిగేది కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లేనని అన్నారు. ఇళ్ల నిర్మాణం, తాగునీరు, డ్రైనేజీ,సీసీరోడ్లు,వీధి దీపాలు, పారిశుద్ధ్యం, మహిళా సంఘాల బలోపేతం, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అంశాల్లో కాంగ్రెస్ స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయని పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని,అభివృద్ధి కొనసాగాలంటే కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను భారీ మెజారిటీతో గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. నామినేషన్ ర్యాలీ కాంగ్రెస్ పార్టీ బలాన్ని,ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబించిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా,సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ్రు శోభారాణి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐన్యాల చైతన్యరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోద శ్రీరాములుతో పాటు ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు, ఆయా వార్డుల కాంగ్రెస్, సీపీఐ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేసిన ఉపాధి హామీ కార్మికులు

- **సిపిఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు**



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలంలో బొద్ధపువానిపాలెం గ్రామంలో ఉపాధి హామీ కార్మికుల పని ప్రదేశంలో శుక్రవారం ఉపాధి హామీ కార్మికులు సిపిఎం నాయకులు ఉపాధి హామీ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ వర్ధంతి రోజున జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరణకు ప్రతిజ్ఞ చేయడం జరిగిందని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని దెబ్బతీసేలా నూతనంగా జి రామ్ జి పథకాన్ని తీసుకురావడం గ్రామీణ పేదలపై దాడి చేయడమేనని అన్నారు.

పాత చట్టం ఉపాధిని పక్కాగా అమలకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ స్ఫూర్తితో గ్రామీణ పేదలకు, రైతు, కూలీలకు అండగా ఉన్న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి అందరితోనూ కలిసి పోరాడుతాను. గ్రామీణ పేదలమైన మనకు పని హక్కును కల్పించిన చట్టం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం. ఈ చట్టం కాపాడుకోవడానికి పోరాడుతామని ఈ చట్టం వలన గ్రామీణ ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందాయని జాతిపిత మహాత్మా గాంధీ పేరు తొలగించడం దుర్మార్గమని ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పోరాడాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు వివి రమణ, పిడి నాయుడు, గని శెట్టి సత్యనారాయణ, కొప్పాక దేవుడు, లక్ష్మి, పార్వతి, సన్యాసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు భారీ షాక్

- **బీఆర్ఎస్ లో చేరిన ప్రజాప్రతినిధులు, నాయకులు**
- **కాంగ్రెస్ పాలనలో కానురాని అభివృద్ధి**
- **కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి మందగించిందని విమర్శ**



**జయభేరి, శామీర్ పేట్ :**

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమి లేదని, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన బండి లక్ష్మీ, బండి రాంరెడ్డి, బండి శ్రీకర్ రెడ్డి తో పాటు సుమారు 20 మంది కాంగ్రెస్ పార్టీ నేతలు మల్లారెడ్డి సమక్షంలో కారు పార్టీలో చేరారు. అనంతరం గ్రామంలో కార్నర్ మీటింగ్ లో మల్లారెడ్డి పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పనులు పూర్తిగా మందగించిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత బిఆర్ ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి తప్పా ప్రస్తుతం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు గుర్క కుమార్ యాదవ్, చీదు వనజ శ్రీనివాస్ రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు శ్యామ్, వంగ వెంకట్ రెడ్డి , ముద్దం మధుసూదన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ సగ్గు శ్రీనివాస్ యాదవ్,స్థానిక నేతలు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# లింక్ రోడ్ నిర్మాణానికి ఆమోదం

- సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి కాలనీవాసుల పాలాభిషేకం
- కాలనీలవాసులతో కలిసి పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**



ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న అంబర్ పేట అలీ కేఫ్ ఉప్పల్ నల్ల చెరువు వరకు లింక్ రోడ్ నిర్మాణ పనులకు ఆమోదంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అంబర్ పేట, పటేల్ నగర్, రామంతాపూర్, ఉప్పల్ భగాయత్ డి మార్ట్, మెట్రో క్యాష్ అండ్ క్యారీ మీదుగా వరంగల్ జాతీయ రహదారికి కలుపుతూ ఈ రహదారిని ఏర్పాటుకు అడుగులు పడటంతో ఈ ప్రాంత వాసుల కల నెరవేరనుంది. ఈ రోడ్ నిర్మాణానికి రూ.160 కోట్ల నిధులు మంజూరుతో ఈ ప్రాంతంలోని కాలనీ వాసులు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

అనంతరం పటేల్ నగర్, రామంతాపూర్, ఉప్పల్ ప్రాంతాలలోని కాలనీవాసులు త్వరలోనే పనులు చేపట్టబోయే లింక్ రోడ్ మార్గంలో జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు శ్రీధర్ బాబు భారీ పాదయాత్ర చేపడతారు అని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపిందని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.



ఉప్పల్ నియోజకవర్గం పట్ల సంపూర్ణ అవగాహన ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి భారీ నిధులను మంజూరు చేయిస్తున్నారని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తాఫిక్, డివిజన్ అధ్యక్షులు రఫిక్, వలపు శ్రీకాంత్ యాదవ్, జలీల్ పాషా, కాలనీ అధ్యక్షులు టీవీ కాలనీ అధ్యక్షుడు సత్తిరెడ్డి, కేసీఆర్ నగర్ అధ్యక్షుడు కే.స్వామి, గాంధీనగర్ అధ్యక్షుడు మొగిలి లింగం, శ్రీనగర్ కాలనీ అధ్యక్షుడు పెద్దిరాజు సందీప్ కుమార్, శాంతినగర్ కాలనీ అధ్యక్షుడు టి.నర్సింగరావు, సత్య నగర్ కాలనీ అధ్యక్షుడు రామ కృష్ణ రెడ్డి, మేడ్చల్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కిషోర్, కురుమ అధ్యక్షులు గోటికే సత్తయ్య, కోదండ రామ ఆలయ మెంబెర్ మల్లయ్య, అభయ ఆంజనేయ దేవాలయ మెంబెర్ రఘు, జనరల్ సెక్రటరీ బాలయ్య, కాంగ్రెస్ నాయకులు సంధ్యరాణి, రాజిరెడ్డి, ఉపేందర్ రెడ్డి, పూస సత్తాన్న, భాస్కర్, అలీమ్, సుధాకర్ డేవిడ్ సంతు, బుల్లెట్ అశోక్, మిట్టు, సతీష్ గౌడ్, ముత్యాల జంగయ్య, ముత్యాల బాబు, శామ్యూల్, సీమ కండ్ల జంగయ్య, విజయ్, అరుణ్ సాయి, శ్రీనివాస్ గౌడ్, నరసింహ, శాగ శ్రీధర్, కాషామల్లా శంకర్, ఖదీర్, పెంటయ్య, యాదగిరి రెడ్డి, ఉదయకుమార్, జంగా రెడ్డి, రాంచందర్, నాగరాజు జి స్వామి, శ్రీనివాస్ గౌడ్, కృష్ణ, నాగమల్లయ్య, శంకర్ గౌడ్, కృష్ణ, వెంకటేష్, అంజయ్య, రాము, చింటు, సలీం, గౌతమ్ కిరణ్, అంబికా, గాయత్రి, మేంగా శోభ, గీత, బెజ్జం శోభా, సువర్ణ, వాసవి. హరీష్ రెడ్డి, నరసింహ, షబీర్, ముస్తఫా, పాషా, గుముల అశోక్, భాను, భాస్కర్, నాగ చారి, ఒగ్గు సిద్దులు, సురేష్, శ్రీకాంత్, రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం కేసీఆర్ కు సిట్ నోటీసులు జారీ చేయడంపై పెల్లుబిక్కిన ఆగ్రహ జ్వాలలు

- శామీర్ పేటలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసిన బిఆర్ ఎస్ నేతలు
- కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని విమర్శ

**జయభేరి, శామీర్ పేట్ :**



ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆత్మ బలిదానానికి కూడా వెనుకడుగు వేయకుండా మొక్కవోని దీక్షతో ఉన్న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు సిట్ నోటీసులు జారీ చేయడాన్ని బిఆర్ ఎస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శామీర్ పేటలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌ను రాజకీయ కక్షతో వేధించడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్షాలను అణిచివేయడమే లక్ష్యంగా పనిచేస్తోందని ఆరోపించారు. సిట్ నోటీసుల పేరుతో ఉద్యమ నాయకుడి ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ప్రయత్నం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు.కేసీఆర్‌కు మద్దతుగా, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి కక్ష సాధింపు చర్యలతో దృష్టి మళ్లించాలనుకుంటోందని వారు విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు పన్నిన కేసీఆర్ ను ఏమి చేయలేవని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్య యాదవ్, డైరెక్టర్ భూమిరెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బాబు, పవన్ ముదిరాజ్, శేఖర్ బత్తిని, వెంకటేష్ గౌడ్, మహేందర్ ముదిరాజ్, కుమ్మరి కిరణ్, బుర్కా వెంకటేష్, శ్రీనివాస్, కుమార్, ఆంజనేయులు, జి. మధు, శ్రీకాంత్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# దేవరకద్రలో ధర్మానికి, అధర్మానికి మధ్య జరుగుతున్న ఎన్నికలు

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి
- దేవరకద్రలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల నామినేషన్ ర్యాలీ

**జయభేరి, దేవరకద్ర :**

రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో దేవరకద్ర నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) కోరారు. దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో శుక్రవారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల నామినేషన్ల భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. దేవరకద్ర మున్సిపాలిటీలో నీతికి, అవినీతికి, ధర్మానికి అధర్మానికి మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. దేవరకద్ర మున్సిపాలిటీ ప్రజల ఆశీస్సులతో మున్సిపాలిటీలోని 12కు 12 స్థానాలు గెలుచుకొని దేవరకద్ర మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండాను ఎగిరేస్తామని ఆయన ధీమా వ్యక్తపరిచారు. అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్ భారీ ర్యాలీ లో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవరకద్ర లో ఎమ్మెల్యే జిఎంఆర్ కు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే దేవరకద్ర మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వైభవంగా హంస వాహన సేవ

- హంస వాహనంపై ఊరేగిన వెంకటేశ్వర స్వామి వారు

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం రాత్రి హంసవాహన సేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో ప్రతి రోజు ఒక సేవ చొప్పున దేవస్థానంలో నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఉత్సవాల రెండవ రోజు స్వామివారి హంసవాహన సేవ కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం రథ మండపంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం హంసవాహనంపై దేవస్థానం పురవీధుల గుండా స్వామి వారిని ఊరేగించారు. రకరకాల ఆభరణాలు, పూల అలంకరణలో స్వామివారు హంస వాహనంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనం ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామివారి సేవను చూసి తరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, పర్యవేక్షకుడు నిత్యానంద చారి, దేవస్థానం పురోహితులు, సిబ్బంది, వివిధ ప్రాంతాలనుండి తరలి వచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**నేడు హనుమత్ వాహన సేవ, ప్రభోత్సవం..**

మన్యం కొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి హనుమత్ వాహన సేవ, బ్రహ్మోత్సవ పూజా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హనుమత్ వాహనంపై స్వామివారిని అలంకరణలో దేవస్థానం పురవీధుల గుండా ఊరేగిస్తారు.

# బిఆర్ఎస్ లో చేరిన దుబాసి వెంకటస్వామి

- కాంగ్రెస్ కు వరుస షాక్‌లు బిఆర్ఎస్ వైపు ప్రజా ప్రవాహం

**జయభేరి, పరకాల, జనవరి 30:**



పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు దుబాసి వెంకటస్వామి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) లో చేరడం జరిగింది. వారితో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన బొచ్చు సతీష్, దండ్ర వెంకట్, ఒంటేరు బాబురావు, కోగిల సుధాకర్ తదితరులు బిఆర్ఎస్ లో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి గడిచిన కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలతో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగిందని, అందుకే నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. పరకాల నియోజకవర్గంలో బిఆర్ఎస్ మరింత బలపడుతుందని, రాబోయే ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న సరోజ్ రెడ్డి



**జయభేరి, దేవరకద్ర :**

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం దేవరకద్ర నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, హైకోర్టు న్యాయవాది మందడి సరోజ్ రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కోర్టుకు వెళ్లి ఈ ఓటును వేయడం జరిగింది.



# జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి

**జయభేరి, చింతపల్లి :**

అహింస సత్యం శాంతి సత్యాగ్రహం అహింస పదమే ఆయుధాలుగా చరిత్రపై చెరగని సంతకం చేసిన మహాసంగ్రామాన్ని నిర్మించిన మహర్షి జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా చింతపల్లి మండల కేంద్రంలోని చౌరస్తాలో ఘనంగా ఘనంగా నిర్వహించారు. పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మండలం ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు వందనపు ఆంజనేయులు గుప్తా హోంమంతల పల్లి సర్పంచ వంగల రమేష్ చింతపల్లి వార్డ్ మెంబర్ ఎండి జాఫర్ చెట్లపల్లి హరిప్రసాద్ వీరమల్ల యాదయ్య బోల్సాని సత్యనారాయణ నాళ్ల శివకుమార్ ఎండి అబ్బాస్ ఆగిరి రవీందర్ ఆగిరి శ్రీనివాస్ కాసరపు లక్ష్మణ్ సురేష్ జంగయ్య ఆకారపు శ్రీకాంత్ మంచన శ్రీనివాస్ ఊరే శ్రీనివాస్ గురుకుల రమేష్ తెరటిపల్లి కిషోర్ సముద్రాల నగేష్ ఆకుతోట జంగయ్య అక్బర్ కొరివి గిరి తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ వర్ధంతి స్వచ్ పాఠశాల కార్యక్రమము




**జయభేరి, చందంపేట :**

గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా పరిషత్ హై స్కూల్ చందంపేట పాఠశాలలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తూ విజేతలకు బహుమతి ప్రధానం చేసినారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి లీలారాణి మాట్లాడుతూ సత్యము అహింస ఆయుధాలుగా గాంధీజీ స్వాతంత్ర ఉద్యమాన్ని ముందుకు నడిపి నేడు జాతిపితగా మహాత్మా గాంధీ బోధించిన నైతిక విలువలు సిద్ధాంతాలు ఆయన జీవితమే మనకు ఒక ముఖ్య పాఠమని, ప్రపంచవ్యాప్తంగా ప్రతి దేశంలో కూడా గాంధీజీ సిద్ధాంతాలను పాటించడము ప్రస్తుతము అవసరమని అనేక విశ్వవిద్యాలయాలలో పాఠ్యాంశాలుగా బోధింపబడుతున్నాయని గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని నెలకొల్పడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టి పాఠశాల పరిసరాలను శుభ్రం చేయడం జరిగింది. ఈ కార్యక్రమములో ఎం చంద్రశేఖర్, గోవిందు కొండయ్య, రామచంద్రు, విజయ, డాక్టర్ పిడి వెంకట్, సంధ్యారాణి ,హిందీ కాంప్లెక్స్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 18వ వార్డుకు నామినేషన్ వేసిన మాకం చంద్రమౌళి



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీ సాధారణ ఎన్నిక ల సందర్భంగా శుక్రవారం 18 వార్డులో మాకం చంద్రమౌళి (సీ ఎం) బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు అనంతరం మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకుల అండదండలతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

# 76వ గాంధీ వర్ధంతి వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**

వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ దేవరకొండ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ బజార్లో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు ఆతుకూరి ఆంజనేయులు వనిత క్లబ్ అధ్యక్షురాలు పందిరి జ్యోతి కార్యదర్శులు బెల్దె రవీందర్, బెజవాడ మల్లీశ్వరి కోశాధికారులు పందిరి వెంకన్న, ఆలంపల్లి శిరీష డిస్టిక్ మెంబర్స్ నీల సంజీవ, ఆలంపల్లి పద్మ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చిదేళ్ల వెంకటేశ్వర్లు, వాసవి కళ్యాణ మండపం అధ్యక్షులు వాసా వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ కోశాధికారి పానుగంటి మల్లయ్య, కర్నాటి పురుషోత్తం ,గార్లపాటి శ్రీనివాసులు, గోవిందు శైలజ, మాజీ వాసవి క్లబ్ అధ్యక్షులు సముద్రాల సహదేవ్, గార్లపాటి శ్రీనివాస్, లకుమారపు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీ ఫామ్ ఇవ్వలేదని ఆత్మహత్యాయత్నం

**జయభేరి, నల్గొండ :**

మున్సిపల్ ఎన్నికల్లో బీ ఫారం ఇవ్వలేదని కాంగ్రెస్ నాయకుడు ఆత్మహత్యాయత్నం చేసాడు. నల్గొండ జిల్లా చండూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ తనకు బీ ఫారం ఇవ్వలేదని భూతరాజు వేణు అనే కాంగ్రెస్ నాయకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసాడు. పార్టీలో కష్టపడ్డ వారికి కాకుండా బయటి వారికి టిక్కెట్లు ఇస్తున్నారనే ఆవేదనతో ఆత్మహత్యాయత్నం చేసానని చెప్పాడు. వేణు పరిస్థితి విషమించడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు.



# సీన్‌లోకి కొత్త డైరెక్టర్ ఎంట్రీ

## రజినీకాంత్ – కమల్ హాసన్ మల్టీస్టారర్‌పై మళ్లీ ఊపందుకున్న టాక్..

ఇండియన్ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లిన పాన్ ఇండియా చిత్రాలు, సీక్వెల్స్, ప్రీక్వెల్స్ హవా కొనసాగుతూనే ఉంది. ఇదే క్రమంలో మల్టీస్టారర్ సినిమాలపై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా టాప్ స్టార్స్ కలిసి కనిపిస్తే ఆ సినిమా రిలీజ్‌కు ముందే భారీ హైప్ క్రియేట్ అవుతోంది. అలాంటి క్రేజీ కాంబినేషన్‌లో ఒకటిగా సూపర్ స్టార్ రజినీకాంత్ మరియు యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ కలిసి నటించే సినిమా గత కొన్నాళ్ల క్రితం ఒక్కసారిగా సెన్సేషన్‌గా మారిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ ఇద్దరు లెజెండరీ నటులు కలిసి కనిపించే ఒక ప్రాజెక్ట్ కమల్ హాసన్ నిర్మాణంలో ఉందన్న వార్తలు ఉన్నప్పటికీ, అది కాకుండా మరోసారి వీరి కలయికలో కొత్త సినిమా రాబోతుందన్న ప్రచారం ఇప్పుడు తమిళ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా వినిపిస్తున్న బజ్ ప్రకారం, ఈ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌ను 'జైలర్' దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ టేకోవర్ చేసినట్టు స్ట్రాంగ్ టాక్ వినిపిస్తోంది. ఈ వార్తలకు మరింత బలం చేకూర్చేలా, నెల్సన్ ఇప్పటికే రజినీకాంత్ – కమల్ హాసన్ కలయికపై ఒక అనౌన్స్‌మెంట్ కట్ లేదా కాన్సెప్ట్ వీడియో తరహా విజువల్‌ను సిద్ధం చేస్తున్నాడన్న రూమర్స్ కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ వెంటనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశం మాత్రం తక్కువగా ఉందని సమాచారం. ప్రస్తుతం నెల్సన్ 'జైలర్ 2'తో పాటు ఇతర కమిట్‌మెంట్స్‌లో బిజీగా ఉండగా, తెలుగులో కూడా ఒక సినిమా చేయాల్సి ఉన్నట్టు తెలుస్తోంది. ఆ ప్రాజెక్ట్ పూర్తి అయిన తర్వాతే ఈ భారీ మల్టీస్టారర్‌పై దృష్టి పెట్టే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. రజినీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే అది కేవలం సినిమా మాత్రమే కాకుండా ఒక చరిత్రగా నిలుస్తుందన్న అభిప్రాయం అభిమానుల్లో ఉంది. అందుకే ఈ ప్రాజెక్ట్‌పై వస్తున్న ప్రతి చిన్న వార్త కూడా భారీ చర్చకు దారి తీస్తోంది. అయితే ప్రస్తుతం ఇవన్నీ కేవలం రూమర్స్‌గానే ఉండగా, ఇందులో ఎంతవరకు నిజం ఉందో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాల్సిందే.

# ఎట్టకేలకు దర్శకుడు ఖరారు



సూపర్‌స్టార్ రజనీకాంత్ 173వ చిత్రానికి దర్శకుడు ఖరారయ్యారు. నెల్సన్ దిలీప్ కుమార్ ఈ భారీ ప్రాజెక్ట్ బాధ్యతలు స్వీకరించబోతున్నారు. అగ్ర నటుడు కమల్‌హాసన్ నిర్మాత కావడంతో ఈ సినిమాపై దక్షిణాదిన భారీ హైప్ క్రియేట్ అయింది. సుదీర్ఘ విరామం తర్వాత ఈ లెజెండ్స్ ఇద్దరూ కలిసి పనిచేస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే ఈ సినిమాకు దర్శకుడిని ఖరారు చేసే విషయంలో ఆది నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తొలుత సీనియర్ దర్శకుడు సుందర్ సి ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తారని ప్రకటించారు. అనివార్య కారణాల వల్ల ఆయన ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత లోకేష్ కనకరాజ్, శిబి చక్రవర్తి పేర్లు వినిపించాయి. వారు కూడా ఇతర కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉండటం వల్ల తప్పుకున్నట్లు తెలిసింది. ఎట్టకేలకు నెల్సన్ దిలీప్‌కుమార్‌ను ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి దర్శకుడిగా ఖరారు చేశారు. ఇప్పటికే రజనీకాంత్‌కు 'జైలర్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్‌ను అందించారు నెల్సన్ దిలీప్‌కుమార్. ప్రస్తుతం ఆయన 'జైలర్ 2' చిత్రీకరణలో ఉన్నారు. యాక్షన్‌తో పాటు ఫ్యామిలీ ఎలిమెంట్స్, వినోదం ప్రధానంగా సాగే ఈ కథకు నెల్సన్ మాత్రమే న్యాయం చేయగలడని కమల్‌హాసన్ భావించారని, అందుకే ఆయన్ని దర్శకుడిగా ఎంపిక చేశారని అంటున్నారు. ఏప్రిల్‌లో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనున్నట్లు తెలిసింది.

# సోషల్ మీడియాను షేక్ చేస్తున్న సాంగ్..



ప్రస్తుతం యూట్యూబ్ లో ఓ సాంగ్ తెగ ట్రెండ్ అవుతుంది. ఆ పాట వైబ్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తుంది. అదేనండి.. కూలీ సినిమా లోని మోనికా పాట యూట్యూబ్ లో దూసుకుపోతుంది. దాదాపు 100 మిలియన్ వ్యూస్ క్రాస్ చేసింది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్, నాగార్జున, సత్యరాజ్, శృతి హాసన్ తదితరులు నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద అంతగా ఆకట్టుకోలేకపోయింది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందించారు. ఈ చిత్రంలోని సాంగ్స్ సైతం సూపర్ హిట్ కాదా.. మోనికా పాట మాత్రం తెగ వైరల్ గా మారింది. ఈ పాటలో నటి పూజా హెగ్డే నటించగా.. ఈ పాటలో సౌబిన్ సాహిర్ డ్యాన్స్ వేరేలెవల్. అభిమానులను విపరీతంగా ఆకట్టుకున్న ఈ పాట యూట్యూబ్‌లో 100 మిలియన్లకు పైగా వ్యూస్ అందుకుంది. ఈ పాటను సుబలక్ష్మి, అనిరుధ్ రవిచంద్రన్ పాడారు. ఇప్పటికీ ఈ సాంగ్ తెగ దూసుకుపోతుంది. ఇందులో పూజా హెగ్డే గ్లామరస్ లుక్స్, డ్యాన్స్ అందరిని ఆకట్టుకుంది. ప్రస్తుతం పూజా హెగ్డే సరైన బ్రేక్ కోసం వెయిట్ చేస్తుంది. చాలా కాలంగా ఆమె నటించిన చిత్రాలన్నీ ఫ్లాప్ అయ్యాయి. ఇటీవల సూర్య జోడిగా రెట్రో చిత్రంలో నటించింది. ప్రస్తుతం విజయ్ దళపతి నటించిన జన నాయగన్ చిత్రంలో నటిస్తుంది. అయితే ఈ మూవీ విడుదల విషయంలో వివాదం నెలకున్న సంగతి తెలిసిందే.



# రషా తడానీ టాలీవుడ్ ఎంట్రీ

హిందీ చిత్రం 'ఆజాద్'లో 'ఉయ్ అమ్మ' అనే పాటతో బాగా పాపులర్ అయింది రషా తడానీ. బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె అయిన ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం హిందీతో పాటు దక్షిణాదిలో కూడా అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నది. 'శ్రీనివాస మంగాపురం' చిత్రంతో ఈ సొగసరి తెలుగులో అరంగేట్రం చేస్తున్నది. సూపర్‌స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేని కథానాయకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రానికి అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నారు. అశ్వినీదత్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి పి.కిరణ్ నిర్మాత. శుక్రవారం ఈ సినిమా నుంచి రషా తడానీ ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఇందులో ఆమె సంప్రదాయ దుస్తుల్లో ఆకర్షణీయంగా కనిపిస్తున్నది. ఇటీవలే ఈ సినిమా రెండో షెడ్యూల్‌ని మొదలుపెట్టామని, చక్కటి కుటుంబ కథగా మెప్పిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: జయకృష్ణ, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, రచనదర్శకత్వం: అజయ్ భూపతి.

# 2027 సంక్రాంతి కోసం మాస్టర్ ప్లాన్..

## వెంకీతో మల్టీస్టారర్ ప్లాన్ చేస్తున్న హిట్ డైరెక్టర్..!



తాజాగా మెగాస్టార్‌తో కలిసి ఒక భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఈ డైరెక్టర్.. ఇప్పుడు తన తదుపరి మిషన్ కోసం సిద్ధమవుతున్నారు. ఈసారి ఆయన చేయబోయే ప్రయోగం వింటే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. తన ఫేవరెట్ హీరోతో కలిసి ఐదోసారి బాక్సాఫీస్‌పై దండయాత్రకు ప్లాన్ చేస్తున్నారు. కేవలం తెలుగు నటులతోనే కాకుండా, పక్క రాష్ట్రాల స్టార్ హీరోలను కూడా ఈ ప్రాజెక్టులోకి తీసుకురావాలని పెద్ద స్కెచ్ వేశారు. "టైటిల్ వింటేనే వామ్మో వీడేంట్రా బాబూ" అంటారని స్వయంగా ఆ దర్శకుడే చెబుతుండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. వరుస విజయాలతో దూసుకుపోతున్న డైరెక్టర్ అనిల్ రావిపూడి. తాజాగా 'మన శంకర వరప్రసాద్' సినిమా రూపంలో మరో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి, నయనతార జంటగా నటించిన ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో మెరిశారు. ఇప్పటికే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 360 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి అనిల్ రావిపూడి సత్తా చాటింది. సంక్రాంతి సీజన్‌లో ఇప్పటికే నాలుగు హిట్లు కొట్టిన అనిల్, 2027 సంక్రాంతికి కూడా మరో సినిమాను సిద్ధం చేయాలని నిర్ణయించుకున్నారు. తన తదుపరి సినిమా కోసం ఇప్పటికే ఒక అదిరిపోయే ఐడియా వచ్చిందని, టైటిల్ అనౌన్స్‌మెంట్ నుంచే ఒక విచిత్రమైన జర్నీ స్టార్ట్ అవుతుందని ఆయన వెల్లడించారు.

ఐదోసారి 'విక్టరీ' కోసం..

ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, అనిల్ రావిపూడి తన నెక్స్ట్ మూవీ కోసం మళ్ళీ వెంకటేష్ తోనే చేతులు కలపబోతున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో ఇప్పటికే 'F2', 'F3', 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్' వంటి నాలుగు విజయవంతమైన సినిమాలు వచ్చాయి. ఇప్పుడు రాబోయే ఐదో సినిమా కోసం అనిల్ రావిపూడి ఒక క్రేజీ మల్టీస్టారర్ స్క్రిప్ట్ సిద్ధం చేశారట. వెంకటేష్ సరసన మరో పవర్‌ఫుల్ హీరో ఉండాలని అనిల్ భావిస్తున్నారు.

ఈ ప్రాజెక్టులో మరో హీరో పాత్ర కోసం తమిళ స్టార్ హీరో కార్తీ లేదా మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్ పేర్లను పరిశీలిస్తున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఒకవేళ వీరు కుదరకపోతే దగ్గుబాటి రానాను రంగంలోకి దించి 'బాబాయ్‌అబ్బాయ్' కాంబోతో థియేటర్లను షేక్ చేయాలని అనిల్ ప్లాన్ చేస్తున్నారట. ప్రస్తుతం వెంకటేష్.. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం - AK 47' సినిమా చేస్తున్నారు. 2026 సమ్మర్ లో ఆ సినిమా విడుదలైన వెంటనే అనిల్ రావిపూడి ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం ఉంది.

అనిల్ రావిపూడి సినిమాలంటేనే వినోదం గ్యారెంటీ. అందుకే ట్రేడ్ వర్గాల్లో ఆయన నెక్స్ట్ మూవీపై భారీ ఆసక్తి నెలకొంది. టైటిలే విచిత్రంగా ఉంటుందని అనిల్ చెబుతుండటంతో.. అది ఏ జోనర్ సినిమా అయి ఉంటుందని అభిమానులు ఆరా తీస్తున్నారు. వెంకటేష్ టైమింగ్‌ను వాడుకోవడంలో అనిల్ దిట్ట కాబట్టి, మరోసారి సంక్రాంతి బాక్సాఫీస్‌ను వీరిద్దరూ కొల్లగొట్టడం ఖాయంగా కనిపిస్తోంది. అనిల్ రావిపూడి - వెంకటేష్ కాంబినేషన్ అంటేనే ప్రేక్షకులకు ఒక నమ్మకం. వీరిద్దరి నుంచి రాబోతున్న ఐదో సినిమా ఏ స్థాయిలో ఉంటుందో చూడాలి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**